# ఘరానా మోసగాడి పట్ల పనబాకకెందుకంత వుదారత!

రాజకీయ వాదులకు మొదట వుండవలసిన గుణం - ప్రజలంటే భయం. ప్రజలేమనుకుంటారోననే భావనే ప్రజా స్వామ్యంలో ప్రజా ప్రతినిధులను నడిపించాలి. తప్పు చేసేటప్పుడు ఇది మరింత అధికంగా వుండి తీరాలి. కానీ మహా ఘనత వహించిన మన పార్లమెంట్ సభ్యు



రాలు, కేంద్రమంత్రి పుంగవులు శ్రీమతి పనబాక లక్ష్మి గారికి అటువంటి భయాలు, మొగమాటాలు ఏవీ వున్నట్లు లేదు. ఎవరేమనుకున్నా ఫర్వాలేదు, నా దారి నాదే అనుకుంటున్నారామె.

మోలిన్ మిషన్ చర్చి బిషప్ అనే దొంగ అవతారంతో ఆనందరాజ్ అనే బడా మోసగాడు ఇళ్లు కట్టిస్తానని ప్రజలను మోసం చేస్తున్నాడని; ఆ దగాకోరు కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి పేరు స్వేచ్ఛగా వాడుకుంటున్నాడని 13 నెలల క్రితమే 'జమీన్ రైతు'లో వివరణాత్మకంగా వార్తా కథనం ప్రచురించాము. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం అనికేపల్లి గ్రామంలో ఆమె చేత శంకుస్థాపన చేయించడం కూడా ఆ మోసంలో భాగమని వెల్లడించాము. దానిపై లక్ష్మి గారు మాకొక వివరణ ఇచ్చారు. ఉచితంగా ఇళ్లు కట్టిస్తాను అని చెప్తే నమ్మానని; అంతకు మించి అతడికి తనకు ఎటువంటి సంబంధం లేదని; అతడి మోసంపై తాను పోలీసుకు ఫిర్యాదు చేస్తానని చెప్పారామె. ఈ మాటలు చెప్పి కూడా నెలలు గడిచిపోయాయి. కానీ ఈనాటి వరకు ఆమె పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు లేదు. నిజంగా ఒక కేంద్ర మంత్రి నుంచి ఫిర్యాదు అనేది అంది వుంటే పోలీసు ఇన్ని నెలల కాలం దాన్ని ప్రక్కన పారేయడం సాధ్యమా? వారు పట్టించుకోకుంటే ఆమె వూరకుంటుందా?

ఇప్పుడు ఇదే కథనాన్ని ఈనాడు దినపత్రిక మరింత సవివరంగా ప్రచురించింది. ఈ మోసగాడు రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఎంత మందిని ముంచిందీ వివరించి చెప్పింది. పనబాక లక్ష్మికి అతడికి గల సంబంధాలను కూడా ప్రస్తావించింది. కానీ ఆమె మాత్రం అదే పాత పాట పాడుతున్నది.

అనికేపల్లిలో పనబాక లక్ష్మితో కలిసి తీయించుకున్న ఫోటోలు, వీడియో చిత్రాలు చూపించి ఈ మోసగాడు వంద కోట్ల వరకు కొల్లగొట్టాడని అంచనా. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు కొన్ని వందల గ్రామాలలో జరిగిందీ దోపిడీ. కర్ణాటక రాష్ట్రంలోనూ మంత్రి ఫోటోలను విస్తృతంగా వాడినట్లు తెలుస్తున్నది. ఎప్పటికప్పుడు ఈ సమాచారం ఆమెకు అందుతూనే వుంది. ఆ మోసగాడి బాధితులు ఎంతోమంది ఆమె వద్దకు వెళ్లి మొర పెట్టుకున్నారు. వారికేదో నచ్చచెప్పి తప్పించుకోవడం తప్ప; ఈనాటి వరకు కూడా తన పేరు, ఫోటోలు వాడి మోసం చేస్తున్న వాడి మీద చర్య తీసుకోమని పోలీసును గట్టిగా అడిగిన దాఖలా లేదు. ఆ మోసగాడి పట్ల ఆమె ఎందుకంత వుదారంగా వ్యవహరించింది? ఏమిటా బలహీనత?

ఈనాడు వార్త తర్వాత దీనిపై పోలీసులో కొంత కదలిక వచ్చినట్లు కన్పడుతున్నది. తమకు ఫిర్యాదు అంటూ ఏదీ రానప్పటికీ, తమంతట తాముగా సమాచారం సేకరించి పెడుతున్నామని ఇంటెలిజెన్స్ అధికారులు చెప్తున్నారు. మోసపోయిన వారందరినీ దగ్గరకు పిలిపించుకుని వివరాలు నమోదు చేస్తున్నారు. అయితే ఈ దశలో కూడా పనబాక లక్ష్మి గారు పోలీసును సంప్రదించడం కానీ, ఫిర్యాదు చేయడం కానీ, విచారణ జరపమని కోరడం కానీ జరగడం లేదు. ఒక మోసగాడిని తన భుజానికెత్తుకోవలసిన అవసరం ఆమెకు ఎందుకు కల్గుతున్నది?

పనబాక లక్ష్మి సాధారణ రాజకీయ వాది కాదు; పార్టీకి మాత్రం పరిమితం

> **మోలిన్ మిషన్ చర్చి బిషప్ ఉచితంగా ఇళ్లు కట్టిస్తానని చెప్తే నమ్మానని, అంతకు మించి అతడికి తనకు ఎటువంటి సంబంధం లేదని; అతడి మోసంపై పోలీసుకు ఫిర్యాదు చేస్తానని కేంద్రమంత్రి పనబాక లక్ష్మి 13 నెలల క్రితం చెప్పారు. కాని ఈనాటి వరకు ఆమె పోలీసుకు ఫిర్యాదు చేయక పోవడం అనుమానాలు రేకెత్తిస్తుంది.**

అయిన నేత కాదు. నెల్లూరు జిల్లా ప్రజలందరికీ పార్లమెంటులో ప్రతినిధి ఆమె; నూరు కోట్ల మంది ప్రజలను పాలించే ప్రభుత్వంలో సభ్యురాలు కూడా. అంత బాధ్యతాయుతమైన స్థానంలో వుండేవారు మామూలు కంటే అధికంగా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఆ బాధ్యతను ఏ కొంచెం పరిగణనకు తీసుకుని వున్నా ఈ విషయంలో ఆమె ఇంత నిర్లక్ష్యం చూపలేదు; అజాగ్రత్తగా వుండలేరు. తనను పిలిచి శంకుస్థాపన చేయించిన చోట, చెప్పిన ప్రకారం ఇళ్లు కట్టించి తీరాలని గట్టిగా దబాయించి అడిగానని; అట్లా కట్టించకుంటే పోలీసుకు పట్టించి జైలుకు పంపుతానని బెదిరించానని; దానితో అనికేపల్లి వరకు ఇళ్లు కట్టించి ఇవ్వడానికి ఒప్పుకున్నాడని; తాను పోలీసుకు ఫిర్యాదు చేస్తే ఇళ్లు రావనే భావంతో ఎదురు చూస్తున్నానని చెప్తున్నారు మంత్రి గారు. చాలా పేలవమైన వాదన ఇది. ఆ మోసగాడు కానీ, అతడి సంస్థ కానీ ఇళ్లు కట్టిస్తానని చెప్పడం తప్ప, ఎక్కడా ఒక్క ఇల్లు కూడా కట్టించిన పాపాన పోలేదని ఆమెకు తెలుసు. ఇళ్లు కట్టించడానికి అవసరమైన నిధులు అతడి దగ్గర వున్నాయా లేవా; అతడు చెప్పే విదేశీ సంస్థలు నిజమైనవా, కల్పితమా అన్న సమాచారం సేకరించడం కూడా ఒక కేంద్రమంత్రికి పెద్ద పని కాదు. చిటిక వేస్తే నిజానిజాలు తేల్చి చెప్పే అధికార యంత్రాంగం ఆమె చేతిలో వుంది. అటువంటప్పుడు అతడి మాటలు నమ్మేది ఏమిటి? ఎదురు చూసేది ఏమిటి?

ఈ మొత్తం కథ సాకల్యంగా పరిశీలించి చూస్తే అర్థమయ్యేది - ఇది మోసం అని తెలిసి కూడా మన ఎమ్పీ గారు ఆ బోగస్ సంస్థను వెనకేసుకుని వస్తున్నది అని. ఆమెకూ ఆ మోసంలో సంబంధం వుంది అని చెప్పడం తొందరపాటు అవుతుందేమో కానీ; ఆ మోసగాడి పట్ల ఆమె వుదారంగా వ్యవహరిస్తున్నట్లు మాత్రం నిర్ధారణగా చెప్పవచ్చు. అదే నిజమైతే ఎంత నీచం? ఎంత బరితెగించిన తనం? ఏ ప్రతిఫలం లేకుండా, ఏదో



ఒక గిట్టుబాటు లేకుండా తన పేరు దుర్వినియోగం చేసి కోట్లు కొల్లగొట్టడాన్ని ఒక కేంద్రమంత్రి ఒప్పుకుంటుందా? తెలిసి చేసినా, తెలియక చేసినా ఈ వుదంతంలో మాత్రం పనబాక లక్ష్మి గారి ప్రవర్తన అత్యంత హేయమైనది; నీచమైనది. తనను గెలిపించిన నెల్లూరు ఓటర్ల పరువు తీసిందామె. సాధారణంగా రాజకీయ వాదులు ఇటువంటి మోసపూరిత వ్యవహారాలలో తమ పేర్లు బయట పడినప్పుడు ప్రాణం పోయినంత విలవిలలాడి పోతారు. జనం ఛీకొడతారేమోనని హడలి చస్తారు. కానీ లక్ష్మి గారిలో అటువంటి భయాలు, భావనలు మచ్చుకు కూడా కన్పించడం లేదు. ఈనాడు వంటి దిన పత్రిక తన జాతకం బయట పెట్టినా ఏమీ జరగనట్లే జిల్లాలో కులాసాగా అనుచరుల చేత భజన చేయించుకుంటూ, వేదికలెక్కి ఉపన్యాసాలు దంచుతూ షికార్లు చేస్తున్నారామె. గుండెలు తీసిన బంటు అన్న పదం ఇటువంటి వారిని చూసే పుట్టిందేమో.

జమీన్‌రైతు
వెంకటరమణ విలాస్ మిద్దెపైన,
పొగతోట, నెల్లూరు - 1.
ఫోన్: 2327354

## ప్రజల మనిషి సి.వి. శేషారెడ్డికి పదవీ సత్కారం పరమానందకరం!



శ్రీ సి.వి.శేషారెడ్డి
రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు



శ్రీమతి సోనియాగాంధీ
జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలు



శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి
విశాఖ పార్లమెంటు సభ్యులు



డా॥ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి
ముఖ్యమంత్రి



శ్రీ కేశవరావు
పిసిసి అధ్యక్షులు

అధికారం వున్నా లేకున్నా కాంగ్రెస్ కార్యకర్తల కష్ట సుఖాల్లో భాగస్తులు మీరు...
నిత్య జన ప్రియులు, అందరికీ తలలో నాల్కలా మెలిగే నిరాడంబరులు.
**శ్రీ సి.వి.శేషారెడ్డి** గారిని పిసిసి ఉపాధ్యక్షునిగా ఎంపిక చేయడం పార్టీ
కార్యకర్తలందరికీ పదవీ సత్కారమే... ఈ శుభవేళ... శుభాక్షితలతో



ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి
వైస్ ఛైర్మన్, విబిఆర్ గ్రూప్



ఊటుకూరు బ్రహ్మారెడ్డి
ఛైర్మన్, విబిఆర్ గ్రూప్

**V.B.R** PUBLIC SCHOOL
హరనాథపురం, నెల్లూరు

**V.B.R** E.M. HIGH SCHOOL
ధనలక్ష్మీపురం, నెల్లూరు

**V.B.R** E.M. SCHOOL
ముత్తుకూరు, నెల్లూరు జిల్లా

HOTEL SURYA INTERNATIONAL
మద్రాస్‌బస్టాండ్ దగ్గర, నెల్లూరు

SVS FINANCE CORPORATION
ఆచారివీధి, నెల్లూరు

